గిరిజనుల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం గుర్రంగూడలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సబితారెడ్డిని ఉత్సవ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ పాల్గొన్నారు.

మంత్రి వర్గంలో యాదవులకు స్థానం కల్పించాలి

తుక్కుగూడ: రాష్ట్ర మంత్రి వర్గంలో యాదవులకు స్థానం కల్పించాలని యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 14 శాతం జనాభా ఉన్న యాదవులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికల లోపు యాదవులకు మంత్రి పదవి కేటాయించాలని కోరారు.

కాలుష్య కాసారం

- వ్యర్థాలు, గుర్రపుడెక్కతో నిండిన సరూర్‌నగర్ చెరువు
- దుర్గంధం, దోమల బెడదతో సమీప కాలనీల ప్రజల అవస్థలు

సైదాబాద్: ఒకవైపు మినీ ట్యాంక్‌బండ్.. మిగతా మూడువైపులా కాలనీలు.. నీటితో నిండు కుండలా ఉండి ఆహ్లాదాన్ని అందించాల్సిన సరూర్‌నగర్ చెరువు కాలుష్య కాసారంగా మారింది. చెరువులు సుందరీకరిస్తామంటూ అప్పుడప్పుడూ హడావుడి చేసే అధికారులు ఆ దిశగా చేస్తున్న ప్రయత్నాలు అంతంత మాత్రమే. చెరువులో కాలుష్యం అంతకంతకూ పెరుగుతుండటంతో చెరువు పరిసరాల్లోకి వెళ్తే ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

- సరూర్‌నగర్ చెరువుకు ఒకవైపు ఉన్న ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలవాసులు చెరువులోని కాలుష్యం కారణంగా పలు సమస్యలతో సతమతమవుతున్నారు.
- కొందరు పౌర స్పృహను మరచి ఇష్టానుసారంగా వ్యర్థాలను చెరువులో పడేస్తుండటం వలన కాలుష్య సమస్య మరింత రెట్టింపు అవుతోంది.
- చెరువులో కాలుష్యానికి తోడు గుర్రపుడెక్క విస్తరిస్తుండటంతో పరిసర ప్రాంత వాసులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
- చెరువు నుంచి వస్తున్న దుర్వాసన భరించలేక అన్ని వేళల్లో తలుపులు వేసుకొని ఇళ్లలో ఉండాల్సి వస్తోందని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- గుర్రపుడెక్క వలన దోమల బెడద పెరిగి కంటిపై కునుకు పట్టడం లేదని, దోమ కాటుతో పలువురు డెంగీ వంటి వ్యాధుల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఎంటమాలజీ విభాగం అధికారులు తరచూ చెరువులోని గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.
- చెరువు రక్షణ కోసం ఏర్పాటు చేసిన సెక్యూరిటీ సిబ్బంది ఎప్పుడో ఒకసారి కనిపిస్తుంటుందని, అధికారులు పూర్థిస్థాయిలో సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి చెరువులో ఎవరూ వ్యర్థాలు వేయకుండా చూడాలంటున్నారు.
- సుందరీకరణలో భాగంగా చెరువు చుట్టూ నిర్మించిన కట్టను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే ప్రజల రాకపోకలకు అనువుగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.



కాలుష్యంతో నిండిన సరూర్‌నగర్ చెరువు

సరూర్‌నగర్ చెరువును సుందరీకరించాలి



సరూర్‌నగర్ చెరువును అధికారులు పూర్తిస్థాయిలో సుందరీకరించాలి. అరకొర పనులతో చేతులు దులుపుకోకుండా చెరువు అభివృద్ధికి అధికారులు పూర్తి సమయం కేటాయించాలి. చెరువులో కాలుష్యం కారణంగా దుర్గంధం, దోమలతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

–నల్లిమెల్లి మోజెస్, శంకేశ్వరబజార్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి



సరూర్‌నగర్ చెరువులో ఎవరూ వ్యర్థాలు వేయకుండా అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలి. అరకొరగా కాకుండా పూర్తిస్థాయిలో సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలి. పరిసర కాలనీలవాసులు తాము చెరువులో వ్యర్థాలు వేయకపోవడమే కాకుండా ఎవరైనా వేస్తుంటే అడ్డుకోవాలి. చెరువు సుందరంగా ఉంటేనే పరిసర ప్రాంతాలు ఆహ్లాదంగా ఉంటాయని అందరూ గుర్తించాలి.

–షేక్ మహమూద్, ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



షబ్బీర్‌అలీని గజమాలతో సన్మానించిన మక్సూద్ అహ్మద్

చాదర్‌ఘాట్: రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాల వారి సంక్షేమానికి ఎంతో కృషి చేస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మక్సూద్ అహ్మద్ ఆధ్వర్యంలో మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన షబ్బీర్‌అలీని ఆయన గజమాలతో సన్మానించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నింటినీ అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి చైతన్యపరుస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ఆకుల రాజు, జఫర్ ఇక్బాల్, గౌస్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణం అభినందనీయం



కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీవాసులు నిధులు పోగు చేసుకుని సొంతంగా కమ్యూనిటీహాల్ నిర్మించుకోవటం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని అనితానగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు నిర్మించుకున్న కమ్యూనిటీహాల్‌ను ఆదివారం కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీవాసులు ప్రభుత్వంపై ఆధారపడకుండా కమ్యూనిటీహాల్ నిర్మించుకోవటం సంతోషకరమన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తాను ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నూతన ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



నూతన ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న నాయకులు

చైతన్యపురి: చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్‌ను కొత్తపేట, చైతన్యపురి డివిజన బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆదివారం ఆయనను పోలీస్‌స్టేషన్‌లో కలిసి శాలువాతో సత్కరించారు. శాంతి భద్రతలు కాపాడటంలో తమ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లింగాల రాహుల్‌గౌడ్, కృష్ణ, నరేష్, కిషన్, నాగరాజు, జలందర్, కిరణ్, నరేష్, శశి, భాస్కర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాత్ సాయినగర్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నాగోలు: డివిజన్ పరిధిలోని సాత్ సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బద్దం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.రేవంత్ గౌడ్, ఎ.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ ఉమేష్ గౌడ్, కోశాధికారి పీఎస్ రాము, సహాయ కార్యదర్శులుగా పరమేశ్వర్ రెడ్డి, శివకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా రాముల, ఏవీ కృష్ణారెడ్డిని ఎన్నకున్నారు. మరో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకుంటామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. కాలనీవాసులందరినీ కలుపుకొని కాలనీలో అభివృద్ధికి కృషి చేస్తామని, ఎలాంటి సమస్య రాకుండా చూసుకుంటామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయాలి

- ప్రజల వద్దకు పాలన చేరువ చేసిన నేత జగన్
- గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి



గిద్దలూరు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

నాగోలు: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానీ సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్నాయని, జగనన్న ప్రభుత్వం..ప్రజల ప్రభుత్వం అని ఏపీలోని ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నాగోలులోని అనంతుల ధర్మారెడ్డి గార్డెన్‌లో వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేపీ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, ప్రజల వద్దకు పాలన అందించిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన 100 శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్సార్ పార్టీకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంను చేయాలని కోరారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని జగన్‌మోహన్ రెడ్డి తను ఇక్కడికి పంపించారన్నారు. తాను మార్కాపురం ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉంటూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి చేశానని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు గత ఎన్నికల్లో మాదిరిగా సమన్వయంతో పనిచేసి ఇక్కడ ఉన్న వారిని తీసుకువచ్చి ఓట్లు వేయించి తనను గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి మాట్లాడుతూ, ఏపీలో వైఎస్సార్ పార్టీ మీద ప్రతిపక్ష పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, వాటిని తిప్పి కొట్టాలని సూచించారు. కార్యక్రమంలో గిద్దలూరు ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, ఏపీ ఎంఎస్ ఎంఈ డైరెక్టర్ బద్రీనాథ్, రాచర్ల జెడ్పీటీసీ వెంకట్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్, సీఆర్‌ఐ మురళి, సీహెచ్ రమణారెడ్డి, గిద్దలూరు మాజీ సర్పంచ్ సురేందర్, మధుసూదన్‌తో పాటు నగరంలో ఉంటున్న వివిధ వర్గాల ప్రజలు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో).. టమాటా 13, వంకాయ 23, బెండ 50, పచ్చిమిర్చి 50, కాకర 48, బీర 40, క్యాబేజీ 26, ఫ్రెంచి బీన్స్ 40, క్యారెట్ 25, దొండ 35–40, చిక్కుడు 28–50, గోకర 45, బీట్‌రూట్ 25, క్యాప్సికం 55, ఆలు 23, దోస 25, సొర 11, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 50. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు యాకుత్‌పురా రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులకు శంకుస్థాపన

యాకుత్‌పురా: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా పాతబస్తీలోని యాకుత్‌పురా రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి నిర్మాణ పనులకు సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని యాకుత్‌పురా కార్యక్రమ ఇన్‌చార్జ్, హైదరాబాద్ డీఎఫ్ఎం వై.సందీప్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉదయం 10.30 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రధాని నరేంద్ర మోదీ.. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రులు రావ్ సాహెబ్ పాటిల్ దన్వే, దర్శన జర్దోష్‌లతో కలిసి దేశవ్యాప్తంగా 554 రైల్వే స్టేషన్లు, 1500 బ్రిడ్జిలకు శంకుస్థాపన చేస్తారని వారు తెలిపారు.

సంత్ సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



సేవాలాల్ జయంతి ఉత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్‌ను అందరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ ఆంజనేయ స్వామి కల్యాణ మండపంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ, సేవాలాల్ మహరాజ్ 285 వ జయంతి ఉత్సవాలను తన డివిజన్‌లో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మైటుపల్లి సంతోశ్‌రెడ్డి, సురేశ్‌కుమార్, భరత్‌లాల్‌నాయక్, రాంబాబునాయక్, రవికుమార్ నాయక్, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



రెడ్డి కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. ఆదివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఎస్‌డీపీ నిధులతో చేపట్టిన బాక్స్‌డ్రైన్ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ పనుల కారణంగా గుంతలమయంగా మారిన రోడ్ల పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి అంజిరెడ్డి, చంద్రశేఖరెడ్డి, నర్సిరెడ్డి, ఫణికుమార్, స్వామిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మెజార్టీ ఎంపీ స్థానాలు మావే..

కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్‌ఆర్



మహేశ్వరం: పార్టీలో చేరిన వారితో కేఎల్‌ఆర్ తదితరులు

మహేశ్వరం: త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకొని, సోనియా గాంధీకి కానుకగా ఇస్తామని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ యువ నాయకులు కర్రోళ్ల చందు ముదిరాజ్‌తో పాటు పలువురు కార్యకర్తలు కేఎల్‌ఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు చేసిన రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన వెల్లడించారు. పార్టీకి నియోజకవర్గం కంచుకోట అని, కొందరు పార్టీ నుంచి పదవులు అనుభవించి, కన్నతల్లి లాంటి పార్టీని వదిలి, ఇతర పార్టీలోకి వెళ్లారని ఆరోపించారు. నాయకులు వెళ్లినా, కార్యకర్తలు బలంగా ఉన్నారన్నారు. త్వరలో జరిగే లోకసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఖాళీ కావడం ఖాయమని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కెఎల్‌ఆర్ కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన సాధ్యమని గ్రహించి, ఇతర పార్టీల నుంచి నాయకులు, ప్రజాప్రతినిధులు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నారని వెల్లడించారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం!

- 'కార్పొరేట్'కు దీటుగా 'సర్కారు' పాఠశాలల్లో పదో తరగతి చదువులు
- సీసీఈ విధానంతో మెరుగైన ఫలితాలు


చంపాపేట: సర్కారు బడులంటే చెట్ల కింద చదువులు...శిథిలావస్థకు చేరిన భవనాలు.. విరిగిన కుర్చీలు..వేళకురాని టీచర్లు.. ఇవ్వన్నీ ఒకప్పటి మాట. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దీనికి పూర్తి భిన్నం. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యాబోధనా వ్యవస్థలో పాలకులు తీసుకుంటున్న విప్లవాత్మక మార్పులు, ఉపాధ్యాయుల్లో పెరిగిన చిత్తశుద్ధి కారణంగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తూ సత్తా చాటుతున్నారు.

- చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్, చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇక్కడ పదో తరగతి ఇంగ్లీష్, తెలుగు మీడియం కలిపి 320 మంది చదువుకుంటున్నారు. టెన్త్ ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఇప్పటికే కసరత్తులు ప్రారంభించారు.
- విద్యార్థులు మానసిక స్థాయి ఆధారంగా మూడు గ్రూప్‌లుగా విభజించి ప్రతిరోజూ సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్టులు, ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.
- చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ముఖ్య పాఠ్యాంశాలను అర్థమయ్యే విధంగా పలుమార్లు బోధన చేస్తూ మార్చి18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలో సునాయసంగా ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.
- సీసీఈ విధానంతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర విద్యాశాఖ నిరంతర సమగ్ర మూల్యాంకన (సీసీఈ) విధానం అమలులోకి తెచ్చింది. దీంతో విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి చెప్పి ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనా సమయంలోనే విద్యార్థులకు ఎంత మేర అర్థమైందో తెలుసుకునేందుకు వారితోనే స్వయంగా ప్రశ్నలు రూపొందించి సమాధానాలు రాబట్టే విధానాన్ని అమలు పరుస్తున్నారు.
- దీంతో ఆయా పాఠ్యాంశాలపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన పెరిగి పరీక్ష మయంలో ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా సమాధానాలు రాసే విధంగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు.



కర్మన్‌ఘాట్ ఉన్నత పాఠశాలలో స్లిప్ టెస్ట్ రాస్తున్న పదవ తరగతి విద్యార్థులు


నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదో తరగతిలో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో 143 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది నవంబర్ నెల నాటికే సిలబస్ పూర్తి చేశాం. డిసెంబర్ నెల ప్రారంభం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో మూడు గంటల పాటు ప్రత్యేక తరగతులతో పాటు ప్రతీ రోజు పాఠ్యాంశాల వారీగా స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నాం. పాఠశాలలోని ప్రతీ ఉపాధ్యాయుడి సహకారంతో చదువులో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ జీపీఏ 10తో అధిక విద్యార్థులు, నూరు శాతం ఉత్తీర్ణతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాం.

– ఎం.పద్మ, కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం


ప్రణాళికాబద్ధంగా బోధన



గతంలో ఆరు సబ్జెక్టులకు గాను రెండవ లాంగ్వేజ్‌కు మినహా అన్ని సబ్జెక్టులకు రెండేసి అంటే.. 11 పేపర్లు ఉండేవి. కరోనా కాలం నుంచి ఏడు పేపర్లుగా కుదించారు. అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్ష పేపరు ఉండగా, సైన్స్‌లో మాత్రం ఫిజిక్స్, బయాలజీలను వేరు చేసి రెండు పేపర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా బోధన చేసి పరీక్షకు సర్వం సిద్ధం చేశాం. గత విద్యా సంవత్సరం కంటే ఎక్కువ సంఖ్యలో జీపీఏ 10, పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి తీరుతాం.

– గణేష్, స్కూల్ అసిస్టెంట్, కర్మన్‌ఘాట్


తల్లిదండ్రులకు ఫోన్ చేస్తున్నాం..



పాఠశాలలోనే కాకుండా విద్యార్థులు ఇంటివద్ద చదువుకునేలా ప్రయతిన్నస్తున్నాం.ఉదయం 5 గంటలకే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి వారి పిల్లలను చదివించే ప్రయత్నం చేస్తున్నాం. అనుమానం వస్తే మరోమారు ఫోన్ చేసి పిల్లలు చదువుతున్నారా లేదా అని ఆరా తీస్తున్నాం. ప్రతీ ఉపాధ్యాయుడు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దుతున్నాం. నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేస్తున్నారు.

: శ్రీహరి కృష్ణ, స్కూల్ అసిస్టెంట్, కర్మన్‌ఘాట్

పాఠశాలకు పేరు తెస్తా..



మా పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగా ఉంది. ప్రతీ సబ్జెక్టులో పాఠ్యాంశాలన్నీ ఇప్పటికే మూడుసార్లు రివిజన్ చేశాం. అర్థం కాని పాఠ్యాంశాలు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. మొత్తం సిలబస్‌లో ఏ ప్రశ్న వచ్చినా ఆందోళన లేకుండా సునాయసంగా రాసేటట్లు ఉపాధ్యాయులు తర్ఫీదు ఇచ్చారు. పది పరీక్షలో జీపీఏ10 సాధించి తీరుతా. పాఠశాలకు మంచి పేరు తెస్తా.

– కె.రుధిర, కర్మన్‌ఘాట్, టెన్త్ విద్యార్థిని

అక్రమ కట్టడాన్ని తొలగించాలి

మీర్‌పేట: రోడ్డును ఆక్రమించి, నిర్మించిన కట్టడాన్ని తొలగించాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం మీర్‌పేటలో కాలనీవాసులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడారు. నందిహిల్స్ రోడ్ నెం–21లోని ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి, ఏకంగా నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించాడని, దీంతో రహదారి ఇరుకుగా మారి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా, రహదారిని ఆక్రమించి, సెట్‌బ్యాక్ లేకుండా భవనాన్ని నిర్మిస్తున్న సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. ధర్నాలో నందిహిల్స్, చైతన్య హిల్స్, టీచర్స్‌కాలనీ, విజ్ఞానపురికాలనీ, ప్రశాంతిహిల్స్, శివాహిల్స్, నాగార్జునహిల్స్, సెవెన్స్‌హిల్స్ కాలనీలకు చెందిన 100 మంది పాల్గొన్నారు.



భవనం వద్ద రహదారిపై బైఠాయించిన కాలనీలవాసులు